క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ


పరిశీలిస్తున్న ఆర్ఎం సుధాకర్

పొదిలి: ఒంగోలు రీజనల్ మేనేజర్ సుధాకర్ బాబు శనివారం స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పలు విభాగాలను తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే నేరుగా తనకే ఫోన్ చేయాలని సుధాకర్ సూచించారు. ప్రయివేటు బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణం సురక్షింతం కాదని, ఆర్టీసీ బస్సులో ప్రయాణమే సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉంటుందని సుధాకర్ చెప్పారు. పార్సిల్ విభాగాన్ని, స్టాల్స్‌ను, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రయాణికులకు పలు విషయాల్లో అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆర్టీసీ డీఎం జె.సుందరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికునికి నివాళి


నివాళులర్పిస్తున్న మానవత సభ్యులు


పొదిలి: ఆకస్మికంగా మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కిరణ్ మృతి పట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నివాళి అర్పించారు. శనివారం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యలను పరామర్శించారు. మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందచేశారు. ఫ్రీజర్ బాక్సు ఉచితంగా పంపించారు. పొదిలి యూనిట్ చైర్మన్ ముప్పల పార్థసారధి, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.యల్లమందారెడ్డి, అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, డైరెక్టర్లు శ్రావణి వెంకటేశ్వర్లు, జీసీ సుబ్బారావు, ధర్నాసి రామారావు, కిరణ్మయి వరికూటి శిరీష, అభిట్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు ఘన నివాళి


అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మార్కాపురం రూరల్: జిల్లాలో 40 సంవత్సరాల క్రితం మొదటిసారిగా మార్కాపురం పట్టణంలో కలర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి వందలాది మందికి ఫొటోగ్రఫీ నేర్పించి ఉపాధి చూపించిన సీనియర్ ఫొటోగ్రాఫర్ గ్రంధే కోటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల ఆయన మృతి చెందాడు. శనివారం మార్కాపురం ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి అన్నదానం చేశారు. దొంత వెంకటేశ్వర్లు, పల్లా ఓబయ్య, డి. బాబి, రమేష్, శివమణి, ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

మార్కాపురం రూరల్: రాయవరం గ్రామంలో పింఛన్లను మార్కాపురం ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం ఉదయం పంపిణీ చేశారు. పంపిణీలో సచివాలయ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. కార్యదర్శి మోహన్‌రావు, మహిళా పోలీసు ఎస్. నాగలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విళక్కి మహోత్సవం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శ్రీ దుర్గా సమేత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో ఇళక్కి మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకం, విశేష పూజలు, మంగళ హారతులు ఇచ్చి పట్టువస్త్రాలు, పూలచే ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అయప్ప స్వాములు భక్తిపాటల భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకిరించి ట్రాక్టర్‌పై ఆశీనులు గావించి గ్రామంలో అయ్యప్ప మాలధరణ ధరించిన స్వాములు భక్తిపాటలు పాడుకుంటూ వాయిద్యాలతో గ్రామోత్సవం చేశారు. స్వామి వారికి మహిళలు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిర్లక్ష్యం ఖరీదు దాహార్తి


కొనకనమిట్లలో సాగర్ వాల్వ్ నుంచి పోతున్న నీరు


నాగిరెడ్డిపల్లి వద్ద ట్యాంక్ పైప్ నుంచి వృథాగా పోతున్న సాగర్ జలాలు


చౌటపల్లి వద్ద వృథా అవుతున్న సాగర్ నీరు

- వృథాగా పోతున్న సాగర్ నీరు
- పట్టించుకోని అధికారులు

కొనకనమిట్ల: పశ్చిమ ప్రాంతంలో నీటి ఎద్దడి గురించి అందరికీ తెలిసిందే. ఎన్నో గ్రామాలు దాహార్తితో అల్లాడిపోతుంటాయి. అలాంటిది పలు చోట్ల సాగర్ నీరు సరఫరా అవుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వల్ల నీరు వృథా అవుతోంది. గతంలో చందవరం సమ్మర్ స్టోరేజ్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు సాగర్ నీరు అందించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, మినీ ట్యాంక్‌లను నిర్మించి వాటికి సాగర్ నీటిని నింపి పైప్‌ల ద్వారా గ్రామాల్లో సరఫరా చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో కొన్ని చోట్ల పైపులు లీకై నీరు నేలపావుతోంది. నాగిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి కొన్ని నెలలుగా నిత్యం సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. గ్రామాలకు నీటి సరఫరా చేసే సమయంలో చౌటపల్లి బస్టాండ్, కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లోని కుళాయిల నుంచి నీరు పోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నాగిరెడ్డిపల్లి వద్ద అయితే పెద్దపైపు ద్వారా నీరు బయటకు పోతోంది. పలు గ్రామాల్లో కుళాయిలు ఉన్నప్పటికి వాటికి ట్యాప్‌లు బిగించకపోవటంతో నీటి సరఫరా సమయంలో నీరు నేల పాలవుతోంది. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం విచారకరం. అధికారులు నిర్లక్ష్యం వీడి వృథా అవుతున్న సాగర్ జలాల లీకేజీలకు మరమ్మతులు చేపట్టి, లీకేజీలు లేకుండా చూడాలని, ట్యాప్‌లు లేని కుళాయిలకు ట్యాప్‌లు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

పరమ పవిత్రం..భక్తి పరవశం


అలంకరణలో శివలింగం

కొనకనమిట్ల: కార్తీక మాసం పురస్కరించుకొని చివరి శనివారం సందర్భంగా వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఎదురాళ్లపాడు సంగమేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు వేడుకగా శాంతి కల్యాణం నిర్వహించారు.


రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు


ఎదురాళ్లపాడులో శివపార్వతుల కల్యాణం

ప్రతిభను ప్రోత్సహించాలి

మార్కాపురం: విద్యార్థుల్లో దాగి ఉండే ప్రతిభను ప్రోత్సహించాలని, వారిలోని సృజనాత్మకతను, కళలను వెలికితీయాలని మార్కాపురం సీఐ సుబ్బారావు అన్నారు. శనివారం పట్టణంలోని రాక్‌వెల్ స్కూల్‌లో ఆర్ట్ ఎక్స్‌పో 2024 కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వేసిన చిత్రాలు, తయారు చేసిన శిల్పాలను చూసి అభినందించారు. తల్లిదండ్రులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్ వెన్న నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్‌ను అభినందించారు. రూరల్ ఎస్సై అంకమరావు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు.


చిన్నారులకు బహుమతులు అందిస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన నాగార్జున రెడ్డి

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా అర్చకులు శనివారం నిర్వహించారు. ఆఖరి కార్తీక శనివారం కావడంతో చెన్నకేశవస్వామి వారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగమాచార్యులు, బృందం ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా మధ్యరంగ మండపంలో స్వామివార్లకు ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ఉభయ దేవేరులతో చెన్నకేశవస్వామి వారు

దర్శనానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి


స్వామి వారి దర్శనం కోసం క్యూలో భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగనాయక స్వామి దేవస్థానికి శనివారం భక్తులు పోటెత్తరు. కార్తీక మాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రంగనాయునికి దర్శనం చేసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడి దర్శనం చేసుకున్నారు. ఆలయం సమీపంలోని మహిళ కార్తీక దీపాలు వెలగించి తమ భక్తిని చాటుకున్నారు. తొలుత నెమలిగుండ్లరంగనాయకస్వామి వారికి దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశీనాయన, యోగివేయన రెడ్ల, ఆర్యవైశ్య, గోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రాల్లో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ పాల్గొన్నారు.

వన భోజనాలతో స్నేహభావం

పుల్లలచెరువు: ఆధ్యాత్మిక, స్నేహ భావం పెరిగేందుకు కార్తీక వన భోజనాలు అవసరమని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో కార్తీకవన భోజనాలను చౌటపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎస్ఐ సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వన మహోత్సవాలతో ఆధ్యాత్మిక భావాలు, సభ్యుల మధ్య సోదర భావాలు పెంపొందుతాయని, సామాజిక సేవా రంగాల్లో అగ్రస్థానంలో నిలిచి అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా భక్తులు సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

కంభం: విద్యార్థి దశలో ఆకర్షణకు లోనవకుండా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎస్సై బి.నరసింహారావు సూచించారు. స్థానిక కృపామృత స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని నేటి సమాజంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకుల వివరాలు అడిగితే చెప్పకుండా జాగ్రత్త వహించాలన్నారు. కందులాపురం సర్పంచ్, పాఠశాల కరస్పాండెంట్ బత్తుల తిరుపాలమ్మ (రజని), సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించాలి


జైలును పరిశీలిస్తున్న జడ్జి ఓంకార్

గిద్దలూరు రూరల్: జైలులో ఉంటున్న ఖైదీలకు చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు రికార్డులు పరిశీలించారు. విచారణ ఖైదీలకు న్యాయవాది ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యావాదిని ఏర్పాటు చేస్తామన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకున్న ఖైదీలపై బాధ్యతగా ప్రవర్తించాలని జైలు సిబ్బందికి సూచించారు. వారిపై చులకన భావం చూపరాదన్నారు. వారి జీవితాన్ని మంచిగా మార్చి సమాజంలోకి పంపేలా జైలు కేంద్రాలు పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా న్యాయసేవలు పొందే అవకాశాలున్నాయని వివరించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులను అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులపై ఎటువంటి ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు పొందేందుకు కృషి చేయాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు స్బిబంది పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

కంభం: పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ గృహంలో భారీగా నిల్వ ఉంచిన దీపావళి క్రాకర్స్‌ను పోలీసులు శనివారం గుర్తించారు. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం.. అర్బన్ కాలనీలో తనిఖీలు నిర్వహించగా ఓ గృహంలో మార్కాపురానికి చెందిన నాగశ్రీని వాసులు దీపావళి క్రాకర్స్, టపాసులు, ఇతర దీపావళి సామగ్రి భారీగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రెండు గదుల్లో సుమారు రెండు నుంచి మూడు లక్షల రుపాయల విలువ చేసే బాణసంచా స్టేషన్‌కు తరలించారు.


నిల్వ ఉన్న బాణసంచా

ప్రాణత్యాగం చేసిన కామేశ్వరరావు

మార్కాపురం టౌన్: విద్యుత్ శాఖలో కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి ఎస్ఏఎస్ కామేశ్వరరావు అని మార్కాపురం విద్యుత్‌శాఖ ఈఈ పీవీవీ నాగేశ్వరరావు, డీఈ సియానాయక్ అన్నారు. శనివారం విద్యుత్ కార్యాలయం వద్ద కామేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల వేజ్ బోర్డు స్కేల్ పరిష్కారం కోసం యాజమాన్యంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చిన వ్యక్తి కామేశ్వరరావు అన్నారు. కార్మికుల సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేసినా పరిష్కారం కాకపోవడంతో విద్యుత్ సంస్థ చైర్మన్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ప్రాణత్యాగ ఫలితంగా కార్మికులు వేజ్ బోర్డు స్కేలును ఏర్పాటు చేశారన్నారు. గిద్దలూరు డీఈ శేషగిరిరావు, 327 యూనియన్ నాయకులు బీవీఎల్ ప్రసాద్, కేవీ రమణారెడ్డి, వేణుగోపాల్, అంకిరెడ్డి, రాజేశ్వరరావు, బాలాజీ, జనార్దన్‌రావు, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


కామేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు, సిబ్బంది

బియ్యాన్ని దోచుకుంటున్న టీడీపీ ఎమ్మెల్యేలు

మార్కాపురం: జిల్లాలో పేదల బియ్యం దారిమళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్న టీడీపీ ఎమ్మెల్యేల నిర్వాకంతో ప్రజలు విసిగిపోయారని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది మదిరె రంగసాయిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణం ద్వారా ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని, ఇతర నిత్యావసర సరుకులను మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటివద్దనే అందించే విధానాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరి నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రధానంగా రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు.. రవాణా యథేచ్ఛగా సాగుతోందన్నారు. ఈ దందాలో ఎమ్మెల్యేలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక ఏజెంటును నియమించి వారి ద్వారా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయించి ఎక్స్‌పోర్టు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని బట్టి నెల నెలా వసూలు చేసుకుంటున్నారన్నారు. వై.పాలెం, దర్శి నియోజకవర్గాల్లో కూటమి తరపున పోటీచేసి ఓడిపోయిన వారు కూడా బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారన్నారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

మార్కాపురం: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి. శరత్ అన్నారు. శనివారం జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేటు స్కూల్లో చెకుముకి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలైన లహరి, వైష్ణవి, నాగశ్రీలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ సైన్సు పట్ల ఆసక్తి కనబరిచి భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా రాణించాలన్నారు. హెచ్ఎం ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు చెకుముకి టాలెంటు టెస్టు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై. రవికుమార్, ఎం. చంద్రశేఖర్, ఏనుగుల శివ, సాయిక్రిష్ణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో డాక్టర్ శరత్, రవికుమార్ తదితరులు

ఎరువుల దుకాణాల తనిఖీ

కంభం: మండలంలోని పురుగుమందుల దుకాణాలను శనివారం సాయంత్రం మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు డి. బాలాజీనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 4 ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు పరిశీలించి సరైన ధృవపత్రాలు లేని పురుగుమందుల విక్రయాలు అమ్మకాలను నిలిపి వేశారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి మాత్రమే ఉత్పత్తులు కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి స్వరూప ఉన్నారు.

వేసవిలో ఉపాధ్యాయ శిక్షణ నిర్వహించాలి

మార్కాపురం: ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని వేసవికాలంలో నిర్వహించాలని వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రపుసాల చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్నికోరారు. ఇప్పటికే ఉపాధ్యాయుల శిక్షణలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారని అన్నారు. రెసిడెన్షియల్ ట్రైనింగు మానుకోవాలని పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చలనం లేదన్నారు. వీరు నిర్వహించే ట్రైనింగ్ వలన ఉపాధ్యాయులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అనారోగ్య సమస్యలతో, వృద్ధాప్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులను వదిలిపెట్టి ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొనడం ఇబ్బందిగా ఉందన్నారు. శిక్షణలో పాల్గొని మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబంలో అర్హత ఉన్న వ్యక్తికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ట్రైనింగ్స్ అన్నీ స్కూల్ టైమింగ్‌లోనే నిర్వహించాలని, లేదా వేసవిలో నిర్వహించాలని, ఈ విషయంలో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయవద్దని చంద్రశేఖర్ కోరారు.